క్లుప్తంగా

అమ్మవారికి విశేష పూజలు



పోచమ్మకు పూజలు చేస్తున్న భక్తులు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని తునికి శ్రీనల్లపోచమ్మదేవి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. స్థానిక ప్రాంతవాసులతోపాటు వివిధ జిల్లాల నుంచి భక్తులొచ్చి అమ్మవారిని దర్శించుకుని పూజించారు. ముందుగా ఉదయం ఈఓ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆలయ పురోహితులు శివప్ప, రాజేశ్ అమ్మవారికి పూజలు, పంచామృతాభిషేకం చేశారు. అనంతరం వివిధ ఆలయానికి వచ్చిన భక్తులు అమ్మవారికి బోనాలు తీసి ఒడిబియ్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. డప్పు చప్పుళ్లు, శివసత్తుల పూనకాలతో ఆలయ ప్రాంగణం మారుమ్రోగింది. భక్తులు తలనీలాలు సమర్పించారు. ఆలయ అధికారులు వెంకట్‌రెడ్డి.. భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేశారు.

కిరాణా దుకాణాల్లో అక్రమ మద్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యం చూపుతున్న ఎస్‌ఐ మహబూబ్

చిలప్‌చెడ్(నర్సాపూర్): కిరాణా దుకాణాల్లో అక్రమంగా అమ్ముతున్న మద్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ షేక్‌మహబూబ్ తెలిపిన వివరాలిలా.. రాందాస్‌గూడలో కుర్మ శివశంకర్, సారా స్వామిగౌడ్‌కు చెందిన కిరాణా దుకాణాలపై పోలీసులు దాడులు చేసి అక్రమ మద్యాన్ని పట్టుకున్నారు. రూ. 6 వేల విలువ గల సరుకును సీజ్ చేశారు. వారు అక్రమంగా బెల్ట్ దుకాణం నిర్వహిస్తున్నట్లు సమాచారం మేరకు దాడులు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. వారిపై కేసు నమోదు చేశామన్నారు.

అనారోగ్యంతో మాజీ సర్పంచ్ మృతి



నర్సింహులు (ఫైల్)

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని ముట్రాజ్ పల్లి మాజీ సర్పంచ్ విట్ట నర్సింహులు(80) ఆదివారం మృతిచెందాడు. ఇటీవల అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతూ మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. నర్సాపూర్‌లో అంత్యక్రియలు నిర్వహించారు.

బాధితులకు పరామర్శ

నర్సాపూర్ : మండలంలోని ఖాజీపేటకు చెందిన యెల్లారెడ్డిగారి మాణిక్‌రెడ్డి మృతిచెందగా.. ఆయన కుటుంబీకులను ఎమ్మెల్యేతో పాటు పలువురు నాయకులు ఆదివారం పరామర్శించారు. ఎమ్మెల్యే సునీతారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, డీసీసీ తాత్కాలిక అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్‌తో పాటు పలువురు ఆయా పార్టీల నాయకులు.. మృతుడి భార్య యెల్లారెడ్డిగారి పద్మజారెడ్డి, కుమారుడు యెల్లారెడ్డిగారి విజయసేన్‌రెడ్డిలతో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించారు.


ఉచిత వైద్య శిబిరానికి స్పందన



వైద్య శిబిరం నిర్వహిస్తున్న వీఎస్టీ పరిశ్రమ, రెడ్‌క్రాస్ సంస్థ ప్రతినిధులు

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని కాళ్లకల్‌లో వీఎస్టీ పరిశ్రమ, రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఐఎఎస్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ అజయ్ మిశ్రా ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. 400 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సీఈఓ ప్రధాన కార్యదర్శి మదన్‌మోహన్‌రావు, వీఎస్టీ పరిశ్రమ హెచ్‌ఆర్ మేనేజర్ శాంతి తదితరులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వక కలయిక



ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌ను కలిసిన కాంగ్రెస్ చేగుంట మండల నాయికులు

చేగుంట(తూప్రాన్): ఇటీవల ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన ప్రీతమ్‌ను ఆదివారం కాంగ్రెస్ మండల శాఖ అధ్యక్షుడు నవీన్ మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. నాయకులు శ్రీనివాస్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు స్టాలిన్ నర్సింహులు, ఎస్టీ సెల్ నాయకులు ఫకీర్ నాయక్ ఉన్నారు.



కల్వకుంటలో కవాతు నిర్వహిస్తున్న బలగాలు

పోలీస్ కవాతు

నిజాంపేట(మెదక్): కేంద్ర బలగాలు, నిజాంపేట పోలీసులు ఆదివారం మండలకేంద్రంతో పాటు కల్వకుంటలో పుర వీధుల్లో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా రామయంపేట సీఐ వెంకటేశం మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలనే దాని ఉద్దేశం అన్నారు. ఎస్‌ఐ శ్రీనివాస్ రెడ్డి, వేణు, రజాక్, సోహెల్, బన్సిలాల్ పాల్గొన్నారు.



రామోజిపల్లి శివారులో నేలకొరిగిన జొన్నపంట

అకాల వర్షం.. రైతన్నకు కష్టం

పెద్దశంకరంపేట(మెదక్): మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలో పంటలు నేలకొరుగుతున్నాయి. శుక్రవారం నుంచి ఆదివారం వరకు వర్షాలు కురియగా పెద్దశంకరంపేట, ఉత్తులూర్, రామోజిపల్లి, కొత్తాపేట, టెంకటి తదితర గ్రామాల పరిధిలో జొన్నపంట, మొక్కజొన్న పంటలు నేలకొరిగాయి. దీంతో రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

మూర్ఛతో కింద పడి వృద్ధుడి మృతి



కిషన్ మృతదేహం

మెదక్ మున్సిపాలిటీ: మూర్ఛతో కింద పడి వృద్ధుడు మృతిచెందాడు. ఈ సంఘటన పట్టణంలో ఆదివారం వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాలు.. పట్టణంలోని దాయరా కాలనీలో నివసించే ఎల్లబోయిన కిషన్(54) 15 సంవత్సరాలుగా ఫిట్స్ వస్తున్నాయి. ఈనెల 16న సాయంత్రం ఇంట్లోంచి బయటకు వెళ్లిన అతను మెదక్ పోస్ట్ ఆఫీస్ ఎదురు ఒక ఏటీఎం వద్ద మూర్ఛ వచ్చి కింద పడ్డారు. గమనించిన స్థానికులు ఆయన వద్ద లభించిన ఆధారాలతో తనకు ఫోన్ చేశారని అక్కడికి వెళ్లే లోపే ఆయన మరణించి ఉన్నారని మృతుడి కుమారుడు రమేశ్ తెలిపారు. అతని ఫిర్యాదు మేరకు కేసును పోలీసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రారంభానికి నోచని మండల పరిషత్ భవనం

- కేటాయించని ఫర్నిచర్
- గ్రూపు రాజకీయాలే కారణమా?



నూతనంగా నిర్మించిన మండల పరిషత్ కార్యాలయ భవనం

కొల్చారం(నర్సాపూర్): మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన మండల పరిషత్ కార్యాలయ భవనం ప్రారంభానికి నోచడం లేదు. గ్రూపు రాజకీయాలే అందుకు కారణమని స్థానికులు పేర్కొన్నారు. ఇదిలా ఉంటే మండల పరిషత్ భవనం శిథిలావస్థ భవనంలో కొనసాగుతోంది. పెరిగిన పరిపాలన శాఖలకు అనుగుణంగా గదులు, సమావేశ మందిరం సైతం ఇరుకుగా ఉన్నాయి. దీంతో సిబ్బంది ఇబ్బందుల మధ్య విధులు నిర్వర్తిస్తున్నారు. 2013 నవంబర్ లో రూ.80లు ఎంపీపీ నిధులు కేటాయిస్తూ శిలాఫలకం వేశారు. ఆ తర్వాత రెండేళ్లకు పనులు ప్రారంభమయ్యాయి. పూర్తి స్థాయిలో నిధులు కేటాయించినా సరిపోలేదు. దీంతో అదనంగా మంజూరు చేసి మరీ పనులు పూర్తి చేశారు. అయితే ఫర్నిచర్ కేటాయిస్తే ప్రారంభోత్సవం చేసుకోవచ్చని పలువురు అంటున్నారు. నూతన భవన నిర్మాణం పూర్తయి నాలుగు నెలలు గడుస్తున్నా గానీ ప్రారంభించాలనే ధ్యాస ఎవరికీ పట్టడం లేదని తెలుస్తోంది. గతంలో కాంగ్రెస్ హయాంలో నూతన భవన నిర్మాణానికి పునాది పడింది. ప్రత్యేక రాష్ట్రం తర్వాత అధికారంలోకి వచ్చిన బీఆర్‌ఎస్ పదేళ్ల పాటు కొనసాగింది. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉంది. దీంతో ప్రారంభోత్సవానికి స్థానిక గ్రూపు రాజకీయాలే అడ్డు కుంటున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పది పరీక్షలకు సిద్ధం

చిన్నశంకరంపేట(మెదక్): పది పరీక్షల నిర్వహణ ఏర్పాట్లు అధికారులు పూర్తి చేశారు. మిర్జాపల్లి జెడ్పీ పాఠశాలలో 145 మంది విద్యార్థులు, తెలంగాణ మోడల్ స్కూల్‌లో 212 మంది, చిన్నశంకరంపేట జెడ్పీ పాఠశాల పరీక్షా కేంద్రంలో 145 మంది పరీక్షలు రాయనున్నట్లు మండల నోడల్ విద్యాధికారి దీప్లారాథోడ్ తెలిపారు. నార్సింగి మండల కేంద్రంలో 113 మంది పరీక్షలు రాయనున్నట్లు హెచ్‌ఎం మురళీ మోహన్ తెలిపారు. ఉదయం 9.30 నుంచి 12.30 వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు హాజరు కావాలని సూచించారు.

పెద్దశంకరంపేటలో..

పెద్దశంకరంపేట(మెదక్): ఎస్సెస్సీ పరీక్ష సోమవారం నుంచి ప్రారంభం కాబోతుండగా అందుకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మండల నోడల్ అధికారి, చీఫ్ సూపరింటెండెంట్ వెంకటేశం ఆదివారం తెలిపారు. పేటలోని బాలికల ఉన్నత పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పది పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యార్థులు అరగంట ముందుగానే చేరుకోవాలన్నారు.

ఆరు కేంద్రాల ఏర్పాట్లు

నర్సాపూర్ : మండలంలో ఆరు పదవ తరగతి పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఎంఈఓ బుచ్యానాయక్ తెలిపారు. పట్టణంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల, విజేత, సెయింట్ డాన్ బాస్కో, విష్ణు ఉన్నత పాఠశాలల్లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఆరు కేంద్రాల పరిధిలో 976 మంది పరీక్ష రాయనున్నారన్నారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు జరుగుతాయన్నారు. ఐదు నిమిషాలు ఆలస్యమైనా కేంద్రంలోకి అనుమతిస్తారని ఎంఈఓ తెలిపారు.

కొనసాగుతున్న స్వచ్ఛభారత్



మల్కాపూర్‌లో చెత్తను తొలగిస్తున్న గ్రామస్తులు

తూప్రాన్: గ్రామస్తుల ఐక్యత, అధికారుల సహకారంతో స్వచ్ఛభారత్ కార్యక్రమం మల్కాపూర్ ఆదర్శ గ్రామంలో 405 వారాలకు చేరుకుంది. కాగా దుర్గామాత ఆలయ ప్రాంగణంలో స్వచ్ఛభారత్ చేపట్టారు. సీసీ రోడ్డుపై ఉన్న చెత్తాచెదారాన్ని శుభ్రపరచారు. ఈ కార్యక్రమం ప్రారంభించిన నాటి నుంచి నేటి వరకు గ్రామంలో ప్రతి ఆదివారం రెండు గంటల పాటు శ్రమదానం చేసి గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుతూ ఇతర గ్రామాలకు ఆదర్శంగా నిలుస్తున్నామని తాజా మాజీ ఉప సర్పంచ్ పంజాల ఆంజనేయులు గౌడ్ తెలిపారు. కార్యక్రమంలో మేకిన్ యువత, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సవాల కమిటీ నియామకం

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని తునికి శ్రీనల్ల పోచమ్మదేవి జాతర ఉత్సవాలు నిర్వహించేందుకుగాను తాత్కాలిక ధర్మకర్తల కమిటీని నియామకమైంది. ఆదివారం ఈఓ మోహన్‌రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ ఈనెల 28 నుంచి 31వ తేదీ వరకు జాతర ఉత్సవాలు జరుగుతాయని ఈ నేపథ్యంలో కమిటీని ప్రభుత్వం నియమించిందన్నారు. తాళ్ల శ్రీనివాస్ రెడ్డి, తాళ్ల శ్రీకాంత్‌రెడ్డి, సల్ల పర్వతాలు, వడ్ల ప్రభాకర్‌చారి, తాళ్ల నాయరాణరెడ్డి, కలాలి లక్ష్మీనారాయణగౌడ్, అంబూరి సునీతమహేష్, తలారి భిక్షపతి, అనుమన్పోళ్ల రాములు, మధుపటి శివప్ప, రమావత్ మహేందర్‌ను ధర్మకర్తలుగా నియమించినట్లు చెప్పారు.

ప్రీమియర్ లీగ్ విజేత రాజశేఖర్ జట్టు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న నాయకులు

కౌడిపల్లి(నర్సాపూర్): ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీ విజేతగా రాజశేఖర్‌గౌడ్ టీం, రన్నరప్‌గా అరుణచారి టీం నిలిచింది. మండలంలోని మహ్మద్‌నగర్‌లో మూడు ఆదివారాలుగా పోటీలు జరుగుతున్నాయి. ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో అరుణచారి టీంపై రాజశేఖర్‌గౌడ్ టీం విన్నర్ గెలిచింది. ఈ సందర్భంగా విజేతలకు మాజీ సర్పంచ్ దివ్య, నాయకులు మహిపాల్‌రెడ్డి, గొల్ల రవి బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నూతన చైర్మన్‌కు శుభాకాంక్షలు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన నూతి శ్రీకాంత్‌గౌడ్‌ను, జిల్లా ఓబీసీ సెల్ చైర్మన్ డాక్టర్ సూర్యవర్మ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు ఆదివా రం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలి సి శుభాకాంక్షలు తెలిపారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో డీసీసీ ప్రధాన కార్యదర్శి మోతే కుమార్, గరిపల్లి వెంకటి, చిరంజీవి యాదవ్, మిద్దె ప్రసాద్, దిలీప్ తదితరులు ఉన్నారు.

దోస్త్ మేరా దోస్త్..



సమ్మేళనంలో చారిటబుల్ ట్రస్టును ప్రకటిస్తున్న పూర్వవిద్యార్థులు

- ఘనంగా పూర్వవిద్యార్థుల సమ్మేళనం
- చారిటబుల్ ట్రస్టు ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటన

తూప్రాన్: పట్టణ కేంద్రంలోని చిల్డ్రన్స్ హై స్కూల్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం జరిగింది. ఒకరినొకరు పలకరించుకుని నాటి మజిలీలను గుర్తు చేసుకున్నారు. పూర్వ విద్యార్థులందరూ కలిసి చిల్డ్రన్స్ చారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేస్తున్నట్లు విద్యనభ్యసించిన హైదరాబాద్ సీఐ రవికుమార్, శివ్వంపేట ఎంపీపీ, ఎంపీపీల ఫోరం అధ్యక్షుడు కల్లూరి హరికృష్ణ, ప్రముఖ వ్యాపారవేత్త కల్లూరి హనుమంతరావు ప్రకటించారు. తన వంతుగా రూ.లక్ష రూపాయల విరాళాన్ని అందిస్తున్నట్లు హనుమంతరావు ప్రకటించారు. పాఠశాల కరస్పాండెంట్ వరప్రసాదం చారిటబుల్ ట్రస్ట్‌కు రూ.లక్ష రూపాయల విరాళాలు అందిస్తున్నట్టు పేర్కొన్నారు. పేద విద్యార్థులను, అనారోగ్యాలతో బాధపడుతున్న కుటుంబాలను ఆదుకునేందుకు ఉపయోగిస్తామని పూర్వ విద్యార్థులు పేర్కొన్నారు. విద్యను అభ్యసించిన ప్రముఖ వైద్యులు, ఉపాధ్యాయులు, వ్యాపారవేత్తలు, పూర్వ విద్యార్థుల సమ్మేళానికి వచ్చి తమ గతస్మృతులను జ్ఞప్తికి తెచ్చుకున్నారు. కార్యక్రమంలో నలంద కళాశాల ప్రిన్సిపాల్ రవికుమార్, ఇస్లాంపూర్ సంతోష్ రెడ్డి, నాచారం బాదే జయకుమార్, నర్మద సీడ్స్ సందీప్ రావు, వేణుగోపాల్ రెడ్డి, బాలేష్, నేతి నాగేష్ గుప్తా, తాటి విశ్వం తదితరులు పాల్గొన్నారు.

చాముండేశ్వరీ అమ్మవారిని దర్శించుకున్న భక్తులు



అమ్మవార్లను దర్శించుకుంటున్న భక్తులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): చాముండేశ్వరీ అమ్మవారి ఆలయానికి వచ్చిన భక్తులు ఆలయంలో ఉన్న గల బ్రహ్మి, కాళీ, వైష్ణవి అమ్మవార్లను సైతం దర్శించుకుని, మొక్కులు చెల్లించారు. ఆదివారం కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు గావించారు.



బురదమయంగా మారిన ఎన్‌జీఓ కాలనీలోని వీధి

చినుకు.. చిత్తడి

చేగుంట(తూప్రాన్): చినుకు పడితే ఆ కాలనీ రోడ్డు చిత్తడిగా మారుతుంది. దీంతో జనం నడవడానికి సైతం ఇబ్బందవుతుంది. ఇదీ చేగుంట ఎన్‌జీఓ కాలనీ దుస్థితి. శనివారం అర్ధరాత్రి అకాల వర్షం కురియడంతో మురుగు కాలువలు ఉప్పొంగి నీరంతా రోడ్డుపైకి చేరింది. దీంతో బ్రహ్మేంద్ర టాకీస్ రోడ్డు బురదమయమైంది. ఎప్పుడు వర్షాలు కురిసినా రోడ్డుపైకి మురుగు నీరు చేరుతుందని ఈ సమస్యను పరిష్కరించాలని అనేక సార్లు అధికారులకు విన్నవించినా ఫలితం లేకుండా పోయిందని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

కోడ్ ఎఫెక్ట్



నిజాంపేట: గోడలపై రాతలను చెరిపేస్తున్న సిబ్బంది

నిజాంపేట(మెదక్): మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో గోడలపై ఉన్న రాతలను ఎంపీడీఓ రాజిరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం చెరిపేస్తున్నారు. ఫ్లెక్సీలు, పోస్టర్లను తొలగిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల కోడ్ అమలు ఉన్నప్పుడు గ్రామాల్లో రాజకీయ పార్టీలకు చెందిన పోస్టర్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయరాదని, గోడలపై రాతలు రాయకూడదన్నారు. అందుకే పాత వాటిని తొలగించడం, చెరిపేయడం చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఐ శ్రీనివాస్ రెడ్డి, వివిధ గ్రామ కార్యదర్శులు ఆరీఫ్ హుస్సేన్, నర్సింహులు, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నర్సాపూర్ : ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో పలువురు దివంగత రాజకీయ నాయకుల విగ్రహాలకు అధికారులు ముసుగు వేశారు. నర్సాపూర్ పట్టణంలో ఆయా పార్టీలకు చెందిన రాజకీయ నాయకులు మాజీ ఉప ప్రధాని జగ్జీవన్‌రాం, మాజీ ముఖ్యమంత్రులు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, ఎన్‌టీఆర్, మాజీ ఉప ముఖ్యమంత్రి జగన్నాథరావు, మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి తదితరుల విగ్రహాలకు అధికారులు ముసుగు వేశారు.

పెద్దశంకరంపేట(మెదక్): లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ ప్రకటన తర్వాత ఎన్నికల కోడ్ అమలులోకి రాగా.. ఆదివారం పేటలోని ఆయా కూడళ్ల వద్ద ఏర్పాటు చేసిన వివిధ పార్టీలకు చెందిన ఫ్లెక్సీలను గ్రామకార్యదర్శులు తొలగించారు. బాధ్యులు, ప్రజలు పోలీసులకు, అధికారులకు సహకరించాలని అధికారులు కోరారు.



నర్సాపూర్: నాయకుల విగ్రహాలకు ముసుగు తొడిగిన అధికారులు



పెద్దశంకరంపేట: ఫ్లెక్సీని తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది